క్లుప్తంగా

బాలికల క్రికెట్ జట్టుకు అభినందన



విజేతగా నిలిచిన జిల్లా బాలికల జట్టును అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు (టౌన్): ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని నాగర్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం బాలికల క్రికెట్ జట్టును జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ తన చాంబర్‌లో అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో విద్యార్థినులు విజేతగా నిలవడం శుభపరిణామమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచాయని, క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు



మాట్లాడుతున్న హనుమంతరెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలని ఆ బ్యాంకు యూనియన్ నాయకులు హనుమంతరెడ్డి, సురేష్ డిమాండ్‌చేశారు. శుక్రవారం లక్ష్మీనగర్‌లోని పొదుపు మహిళల సమావేశంలో సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెప్మా అర్పీలకు వేతనాలు పెంచాలని కోరారు. ఏపీజీబీ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించే కుట్రను అడ్డుకోవాలన్నారు. పొదుపు మహిళలు ఉమాదేవి, వెంకటేశ్వర్లు, రాధిక, హైమావతి, సరిత, లీలావతి పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలు సంక్రాంతి సెలవుల్లోనూ తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాయని, అలాంటి వాటిపై ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అభి, అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సెలవుల్లో తరగతులను నిర్వహించే పాఠశాలలు, కళాశాలలను అధికారులు సీజ్ చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు ఉండడం అన్యాయమన్నారు. నాయకులు వర్ధన్, చందు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి 2 సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని మాట ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత హామీపై మాట్లడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కర్నూలు నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు కొత్తబస్టాండ్, హాస్పిటల్ సమీపాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. హంద్రీ నీరు ఇళ్లలోకి రాకుండా రక్షణ గోడను ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి

కర్నూలు (టౌన్): స్వచ్ఛ ఆంధ్ర (క్లాప్) ఆటోలను కొనసాగించి, డ్రైవర్లకు పని భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట క్లాప్ ఆటో క్లాప్ డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఇంజినీరింగ్ వర్కర్స్ సమ్మెకాలపు ఒప్పంద జీఓలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 7 నెలల వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో డ్రైవర్లు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కర్నూలు నగరంలోని 52వ వార్డుల్లో చెత్త సేకరణ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్న డ్రైవర్లకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కొంత మంది క్లాప్ ఆటోలను తప్పించి ప్రైవేటు చెత్త ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుగుదేశం నాయకులు చెబుతున్నారన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.24 వేలు జీతాన్ని ఇప్పించాలని కోరారు.



మాధనగర్‌లోని సీతారామాలయంలో స్వామివారు



సత్యనారాయణ స్వామి ఆలయంలో ..



సూర్యనారాయణ స్వామి



సూర్యనారాయణ స్వామి ఆలయంలో వేంకటేశ్వరుడు



లలితా పీఠంలో వేంకటేశ్వర స్వామి వారు



సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనం చేసుకుంటున్న భక్తులు



కల్యాణ మూర్తులుగా స్వామివార్లు



కృష్ణానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోలాటం

ఉత్తర ద్వార దర్శనం.. పరమ పావనం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు
- ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు
- వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కర్నూలు నగరంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని వైష్ణవాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం గుండా భక్తులు వెళ్లి మహా విష్ణువును దర్శించుకొని తరించారు. భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

విజ్ఞాన మందిరంలో స్వామివారు

కర్నూలు కల్చరల్: నగరంలోని ఆలయాల్లో గోవింద నామస్మరణ మార్మోగింది. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీహరిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యం కలుగుతుందనే నమ్మకంతో భక్తులు ఆలయాలకు చేరుకొని వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల కమిటీలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఇస్కాన్ జగన్నాథ మందిరం, కర్నూలు కృష్ణానగర్ శ్రీనివాస మందిర్, వెంకటరమణ కాలనీ చిన్మయమిషన్, వేంకటేశ్వరస్వామి ఆలయం, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, సంకల్‌బాగ్ హరిహరక్షేత్రం, వాసవీ నగర్, దండెగేరి వేంకటేశ్వర స్వామి ఆలయం, చిదంబరావు వీధి కోదండ రామాలయం, అరోరానగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయం, మాసమసీదు గోదాగోకులం, జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం, మాధవీ నగర్ సీతారామాలయం, గణేష్ నగర్‌లోని సీతారామాంజనేయ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాసనగర్ సత్యసాయి మందిరం, సూర్యనారాయణ స్వామి ఆలయం, మారుతీ నగర్‌లోని సీతారామస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారాలను ఏర్పాటు చేసి స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అష్టోత్తర పారాయణం, కల్యాణోత్సవాలు, లక్ష కుసుమార్చనలు, ప్రవచనాలు, ప్రసంగాలు నిర్వహించారు. ఇస్కాన్‌లో రఘునందన సేవక్ ప్రభు, లలితా పీఠంలో మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుమారు రూ.15 కోట్లతో స్వామి, అమ్మవారికి బంగారు తొడుగులు చేయించి అలంకరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివార్లను దర్శనం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తిరుపతిలో జరిగిన ఘటన బాధాకరమన్నారు. మృతులకు ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేయించి బాధ్యులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సర్వ భూపాల వాహనంపై స్వామివారు



లలితా పీఠంలో స్వామివారు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



విజ్ఞాన మందిరంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



సత్యనారాయణస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులు



సూర్య నారాయణ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఉపకమిషనర్ గురు ప్రసాద్, ఆలయ ట్రస్ట్ సభ్యులు



గణేష్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



వెంకట రమణ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి బారులుదీరిన భక్తులు



సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



వీఆర్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ విభాగాల్లో జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వారందరూ బాధ్యతయుతంగా పని చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. కర్నూలు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన టి.ఎం.డి ఫిరోజ్ శుక్రవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే వారికి పదవులు వరిస్తాయన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా రాణించాలి




క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

కర్నూలు (టౌన్): దృఢ సంకల్పంతో విజయమే లక్ష్యంగా క్రీడల్లో రాణించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాల క్రీడా మైదానంలో 16వ జాతీయస్థాయి రోల్ బాల్ పోటీలు రెండవరోజు కొనసాగాయి. పోటీలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. దేశ యువ శక్తిని ప్రపంచ దేశాలకు చాటాలన్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు పుల్లయ్య, సీఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

క్వార్టర్స్‌కు చేరుకున్న బాల బాలికల జట్లు

రెండవ రోజు రోల్‌బాల్ పోటీలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో రాజస్థాన్, కేరళ, అస్సాం, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పాండిచ్చేరి, మహారాష్ట్ర అలాగే బాలుర విభాగంలో రాజస్థాన్, జార్ఖండ్, గుజరాత్, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, జమ్ము అండ్ కశ్మీర్ ఉన్నాయి.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): పారిశుద్ధ్యం లోపిస్తే శానిటరీ ఇన్‌స్పెక్టర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున కమిషనర్ బళ్లారి చౌరస్తా, నరసింహారెడ్డి నగర్, రోజా స్ట్రీట్, పాత ఈద్గా, సంపత్ నగర్, గాంధీనగర్, పాత కంట్రోల్ రూం తదితర ప్రాంతాలను తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, పూడిక తీత తదితర వాటిని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముంతాజ్ వలీ, మునిస్వామి, అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు శ్రీరామ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని శనివారం శ్రీరాముల వారి శోభాయాత్రను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న, గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. ఓల్డ్ సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం వద్ద సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాజ్‌విహార్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు శోభాయాత్ర సాగుతుందన్నారు. అన్ని ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందు అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మికతో జీవన విధానంలో మార్పు

కర్నూలు (టౌన్): ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల ప్రతి వ్యక్తి జీవన విధానంలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయని సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ డాక్టర్ గున్నా శాంతిరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి సండే స్కూల్ ఆధ్వర్యంలో చర్చిలో కిడ్స్ కార్నివాల్ నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన గాలిలోకి బెలూన్స్ వదలి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ.. చిన్నారులను ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ప్రోత్సహించాలన్నారు. తద్వారా మంచి మార్గంలో నడిచేందుకు వీలు ఉంటుందన్నారు. కోల్స్ చర్చి అధ్యక్షులు అబ్రహాం లింకన్ మాట్లాడుతూ కార్నివాల్‌లో మూడు రోజుల పాటు చిన్నారులకు బైబిల్ పాఠాలు, చిరు నాటికలు, సంగీతంతో కూడిన భక్తి గీతాలు నేర్పిస్తారని చెప్పారు. చర్చి పాస్టర్లు అనిల్ కుమార్, జీవన్ రావు, సండే స్కూల్ సూపరింటెండెంట్ దేవ మనోరాజ్, సుధీర్ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో చేపట్టనున్న మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా రెండవ శనివారం పట్టణంలోని క్యాంపు సెక్షన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ క్యాంపు, విజ్ఞాన మందిరం, బిర్లా కాంపౌండ్, అరోరా నగర్, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, శ్రీలక్ష్మినగర్, అమ్మ ఆసుపత్రి పరిసరాలు, టెలికాంనగర్, నందికొట్కూర్ రోడ్, ఎలుకూరు ఎస్టేట్, మారుతి నగర్, బీడీ కార్మికుల కాలనీ తదితర కాలనీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు.

ఫార్మసిస్టు అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ఫార్మసిస్టు అసోసియేషన్ కర్నూలు జిల్లా యూనిట్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఏపీ ఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగల్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగర అధ్యక్షుడు ఎం.సి.కాశన్న, ఫార్మసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నగర సంయుక్త కార్యదర్శి మునీర్‌అహ్మద్, జిల్లా కార్యదర్శి రాజేష్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో

ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ–3194) కర్నూలు జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంసీ నరసింహులు, కార్యదర్శి ఎన్‌డీ సంపత్‌కుమార్, కోశాధికారి ఎస్.సాయిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణయ్య, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీర లింగేశ్వర ఆలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం



దాతను సన్మానించిన మంత్రి సవిత, ఎంపీ నాగరాజు

కర్నూలు(అర్బన్): నగర శివారులో పెద్దపాడు మోడల్ స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న శ్రీ బీర లింగేశ్వర స్వామి ఆలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత అన్నారు. శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి ఆమె ఈ దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఇంత పెద్ద దేవాలయాన్ని నిర్మించడం గర్వకారణమని, ఇందుకు కురువ సంఘం కమిటీ సభ్యుల కృషి అభినందనీయమన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వడంతో పాటు ఇంకా అవసరమైతే వచ్చే కార్తీక వనభోజనాల్లోపు పూర్తి స్థాయిలో నిర్మాణానికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే దేవాలయ స్థల ధాత పాల సుంకన్నను మంత్రి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, ఉపాధ్యక్షులు బీ వెంకటేశ్వర్లు, ధనుంజయ, కోశాధికారి కేసీ నాగన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీల, ప్రధాన కార్యదర్శి కే అనిత పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులతో సామాజిక భద్రత



ఎం.బాలునాయక్

కర్నూలు(అర్బన్): అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డుతో సామాజిక భద్రత లభిస్తుందని కార్మిక శాఖ రాయలసీమ జోనల్ జాయింట్ కమిషనర్ ఎం.బాలునాయక్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత రంగాల్లోని కార్మికులందరూ ఈ–శ్రమ్ ఏ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకొని గుర్తింపు కార్డులు పొందితే సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం రాయలసీమ పరిధిలోని ఎనిమిది జిల్లాల్లో నలుగురు డిప్యూటీ కమిషనర్లు, 18 మంది సహాయ కమిషనర్లు, 48 మంది సహాయ కార్మిక శాఖ అధికారులు ఎల్లప్పుడు కార్మికులకు అందుబాటులో ఉంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటే తప్పక కార్మిక శాఖలో గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఈ–శ్రమ్ పోర్టల్‌లో రాయలసీమ పరిధిలో 44,51,591 మందిని చేర్పించాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 23,64,487 మంది నమోదు చేసుకున్నారన్నారు. మిగతా 21,65,861 మంది సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలని జేసీఎల్ కోరారు.

ఉత్సాహంగా యూత్ ఫెస్టివల్



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్, ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ కర్నూలులో జరగడం నగరానికే గర్వకారణమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. టీజీవీ ఫైన్ ఆర్ట్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ స్కూల్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీవీ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ యువతలో చైతన్యాన్ని కల్పిస్తూ, సమైక్యత భావాన్ని పెంపొందించడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్, ఢిల్లీ పార్లమెంటులో మీడియా ఆర్గనైజర్ కీర్తి, టీజీవీ ఫైన్ ఆర్ట్స్ నిర్వాహకులు భార్గవ్‌కుమార్, గోపాల్, రాజీవ్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.